


ఆది క్రీ.శ.1900వ సంవత్సరం జులై 18వ తేదీ రాత్రి. ఇటలీ దేశపు రాజు ఉంబర్టో తన ప్రధాన అంగరక్షకుడైన జనరల్ వైగలియర్‌తోపాటు 'మేంరాబు ఊరిలోని ఒక రెస్టారెంట్‌లో భోజనానికి కూర్చున్నాడు. ఈ రెస్టారెంట్‌లోని భోజనం చాలా ప్రసిద్ధి కెక్కింది. అయితే, ఉంబర్టోకు భోజనంలో రుచి అనిపించినట్టు లేదు. క్యాష్ టేబుల్ మీద కూర్చున్న మనిషిపై తన దృష్టిని సారిస్తున్నాడు. ఆతని తేజస్సుతో కూడిన మొహంపై తెల్లని మీసాలు కన్పిస్తున్నాయి. రాజుగారు భోంచేస్తున్న సమయంలో సప్లయర్స్‌కు ఆజ్ఞలు జారీచేస్తున్నందుకు అతడే ఆ రెస్టారెండ్ యొక్క యజమానై వుండొచ్చు అని అనుకున్నాడు అంగరక్షకుడు. "నేనితణ్ణే ఎక్కడో చూశాను. అతణ్ణే పిలవండి" అన్నాడు రాజు. జనరల్ వైగేలియర్ తన కనుసైగలతో ఆ ప్రౌఢ వ్యక్తిని పిలిచాడు. అతడు వచ్చి నేలను తాకి రాజుగారికి నమస్కరించాడు.

"మిమ్మల్ని నేను మొదట ఎక్కడనో చూశాను. ఎక్కడ" అడిగాడు ఉంబర్టో రాజు ఆవిధంగా అడగ్గానే అతడిలా అన్నాడు. "క్షమించండి మహారాజా – అధిక ప్రసంగమని అనుకోకండి. మిమ్మల్ని మీరు అద్దంలో చూచుకున్నప్పుడల్లా నన్ను చూచుకున్నట్టు ఔతుంది. అంతే" అన్నాడు. అప్పుడు రాజుకు అర్థమైంది. తాను ఆ హోటల్ యజమానివలె వున్నాడని గ్రహించాడు. ప్రకృతిలోని విచిత్రమిదే కదా? ఒక రాజు – మామూలు హోటల్ యజమానివలె వుండడం ఆశ్చర్యం. ఈ పోలికలను గమనించిన హోటల్‌లోని సాధారణ ప్రజలు కూడా ఆశ్చర్యపోయారు. చిరునవ్వును మొహంపై పూసుకుని "మీ పేరేమిటి?" అని అడిగాడు రాజు హోటల్ యజమానిని. అప్పుడు ఆ యజమాని వినయంగా ఇలా అన్నాడు "మహారాజా నా పేరు ఉంబర్టో... నేను 1844 మార్చి 14వ తేదీన ఉదయం 10–10 నిమిషాలకు జన్మించాను" అన్నాడు.

"ఆశ్చర్యం – అద్భుతం. పేరులో కూడా ఏం మార్పు లేదు. పుట్టిన రోజు సెకండ్లతో సహా సరిపోయింది"

"మీ పుట్టిన ఊరేది" అడిగాడు రాజు మళ్ళీ.

"ఊరినోలో జన్మించాను రాజా"

"నేను కూడా అక్కడే జన్మించాను.." ఔను

"వివాహం ఎక్కడైంది?"

"1866 – ఏప్రిల్ 2న అయింది" హోటల్ యజమాని ఉంబర్టో.

"మీ భార్య పేరు?"

"మార్గరిటా" అన్నాడు రెస్టారెంట్ ఉంబర్ట్.

లగ్నమైన తేదీ – భార్యపేరు కూడా ఒకటే. ఎంత విచిత్రం? అని మనసులో అనుకున్నాడు రాజు.

"సంతానం ఎంతమంది?"

"ఒకే ఒక కొడుకు. విట్టరియా అతడి పేరు"

"ఎంతాశ్చర్యం? నాకూ ఒకే కొడుకు. వాడి పేరు కూడా 'విట్టరియానే' రాజన్నాడు.

హోటల్ యజమాని మారు మాట్లాడకుండా తలవంచుకుని నిల్చున్నాడు. విధి వైచిత్రానికి అతడేం చేస్తాడు...

"మీరు ఈ హోటల్‌ను ఎప్పుడు ప్రారంభించారు"

"1878 జనవరి 9వ తారీకున"

"నేనూ అదే రోజున సింహాసనమెక్కాను"...

"మనమిద్దరం ఎప్పుడూ కలవలేదు కదూ?" అడిగాడు రాజు మళ్ళీ.

"క్షమించండి. మనమిద్దరం రెండుసార్లు కలిశాం రెండుసార్లూ యుద్ధంలోనే కలిశాం. ఇద్దరికీ మన శౌర్యసాహస పరాక్రమాలకు బహుమతి లభించింది. 1866లో ఒకసారి, 1870లో మరొకసారి" అన్నాడు యజమాని. నేను సిపాయిగా చేరాను. మీరు కమాండర్‌గా వుంటున్నారు."

"ఇన్ని విధాలుగా ఒకేవిధంగా వున్న మన జీవితాలకు ఇంతభేదం ఎలా వచ్చింది? రాగూడదే"

"రాగూడదనుకుంటే మహారాజా మీరు అప్పుడప్పుడు మా హోటల్‌కు వచ్చి పోతే చాలు. అదే మాకు పదివేలు"

"తప్పకుండా వస్తాను. ఉంబర్ట్ మీకు ఆటల్లో ఇష్టముందా?"

"ఉంది. రేపటి ఆట పోటీల్లో పాల్గొంటున్నాను. మీ స్వహస్తాల ద్వారా ఇచ్చే బహుమానాన్ని తప్పక నేను తీసుకుంటాను"

హోటల్ యజమానిని పంపివేశాడు. 'ఉంబర్ట్ వెళ్ళిన తర్వాత రాజు తన జనరల్ వైగలియర్‌తో ఇలా అన్నాడు "నాకు ప్రతిబింబంగా వున ఈ ఉంబర్ట్‌ను 'కెవలియర్ ఆఫ్ ది క్రేన్ ఆఫ్ ఇటలీ' అన్న బిరుదుతో పురస్కరిస్తాను. రేపు ఉదయం సిద్ధం చేయించండి" అన్నాడు రాజు.

ఉదయమైంది. రాజు కన్నులు ఉంబర్టో కొరకు వెదుకుతున్నాయి. జనసమూహంలో ఎక్కడైనా వున్నాడేమోనని.

"నేను ఆజ్ఞాపించినా ఆ హోటల్ యజమాని ఎందుకు పిలుచుకు రాలేదు?" అని అడిగాడు వైగలియర్‌ను. జనరల్ వైగలియర్ భయపడుతూ ఇలా అన్నాడు. 'మహారాజా అతడీరోజు మరణించాడు. తుపాకీని సరిచేస్తూ వుండగా గుండు తగిలి..." అని అంటుంటే "అలాగా? అలా ఎలా జరిగింది?" అని అంటూ వుండగా రాజుగారి సమీపంలో వున్నవాడు తుపాకీని ప్రేల్చాడు. మూడు గుండ్లు తగిలి ఉంబర్ట్ రాజు మరణించాడు...

జన్మంలో జరిగిన సామ్యమే మరణంలో కూడా జరిగింది. ●